క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిమ్మాజిపేట: కోడుపర్తి విద్యుత్ ఉప కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్న సందర్భంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి, వెంకాయపల్లి, బావాజిపల్లి, కోడుపర్తి, అప్పాజిపల్లి, రాంరెడ్డిపల్లి, 24 గంటల పాటు భల్లాన్‌పల్లి, పర్వతాపల్లి, కుమ్మెరతండాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

ఇద్దరికి జైలుశిక్ష

లింగాల: మండలంలోని అప్పాయపల్లికి చెందిన రమేష్, కె.నాగరాజులకు మంగళవారం అచ్చంపేట కోర్టు ఐదు రోజులు జైలుశిక్ష విధించిందని ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఒకరు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా, మరొకరు ప్రజలను ఆందోళనకు గురిచేసే సంఘటనలకు పాల్పడుతున్నారని ఎస్ఐ తెలిపారు. వీరిద్దరిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు కల్వకుర్తి కారాగారానికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

బల్మూర్: అడవిలో చీపురు పుల్లల కోసం వెళ్లిన గిరిజన మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని బాణాలలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ రేణయ్య వివరాల ప్రకారం.. మండలంలోని బాణాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(52) ఈనెల 1న గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చీపురుపుల్లల కోసం వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, అడవిలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు శివ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

జగమోనిపల్లిలో యువతి..

తెలకపల్లి: యువతి అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని జంగమోనిపల్లి గ్రామానికి చెందిన యువతి(21) అదృశ్యమైంది. ఈనెల10న కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రించారు. ఉదయం లేచి చూడగా కూతురు కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన శ్రీశైలంపై అనుమానం ఉందని, యువతి తల్లి జ్యోతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిరాణషాపులో చోరీ

తెలకల్లి: కిరాణషాపులో చోరీ జరిగినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. మండలంలోని వట్టిపల్లి గ్రామంలో సూర్యకళ్యాణ్‌గౌడ్ కిరాణ షాపులో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి రూ.35 వేలు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

లింగాల: మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన పిట్టల ఆంజనేయులు(30) సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. సాయంత్రం సమయంలో మానాజీపేట నుంచి వల్లభాపూర్‌కు ద్విచక్రవాహనంపై వస్తుండగా మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై ఆంజనేయులు భార్య రాధ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు.

కార్యదర్శిని మార్చాలని ఫిర్యాదు

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికట్ట గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీతను వెంటనే బదిలీ చేయాలని మాజీ సర్పంచ్ లింగమయ్య ఆధ్వర్యంలో ఎంపీడీఓ వెంకటరాములకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామ కార్యదర్శి ప్రస్తుత తాజా మాజీ సర్పంచ్ భార్యాభర్తలని, కార్యదర్శి చేయాల్సిన పనుల లో భర్త పెత్తనం చేస్తున్నాడని, దీంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో పాండు, భీమయ్య, కేశవులు, తిరుపతయ్య, వెంకటయ్య, పలువురు ఉన్నారు.

విద్యుత్ సిబ్బందికి విద్యుదాఘాతం

బిజినేపల్లి: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ తర్వాత విద్యుత్‌లైన్ మారుస్తున్న కాంట్రాక్టర్, సిబ్బంది బాబు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం .. మండల కేంద్రంలోని మంగనూర్ రోడ్డు మార్గంలో విద్యుత్ కాంట్రాక్టర్ సిబ్బంది బాబు మధ్యాహ్నం భోజనం తర్వాత స్తంభం ఎక్కి తీగలను తాకగానే విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. ఇతర సిబ్బంది వెంటనే చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాబు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో దూర విద్యతో పాటు, టీవీలో టీ–సాట్ ప్రోగ్రామ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎంలు తెలిపారు.

ప్రతి ఎకరాకు నీరు అందేలా ప్రణాళిక

- మార్కండేయ లిఫ్ట్ నీరు పారేలా కాల్వలు నిర్మించాలి
- సాగునీరు అందని ప్రాంతాలు పర్యటించిన ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



మార్కండేయ లిఫ్ట్ కాల్వలకు సంబంధించిన మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద బిజినేపల్లి మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే డా.రాజేష్‌రెడ్డి నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని శాయిన్‌పల్లి, లట్టుపల్లి గ్రామాలకు చెందిన ఎర్రకుంట, ఊర చెరువు, లింగారెడ్డి కుంటలకు మార్కండేయ లిఫ్టు నుంచి నీరు పారేలా కాల్వలను ఏర్పాటు చేయాలని, రైతులకు భూమి నష్టం జరగకుండా చూడాలని సూచించారు. మంగళవారం మండలంలోని మార్కండేయ లిఫ్టు పంపు హౌస్‌ను, సాగునీరు అందని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడెక్కడా సాగునీరు అందించడానికి వీలవుతుందో గమనించి ప్రతి ఎకరాకు నీరు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ అధికారులు పార్థసారథి, శివరాం, కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ



అగ్రహారం తండాలో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. చారకొండ మండల కేంద్రం, తిమ్మాయిపల్లి, సారంబండ తండా, అగ్రహారంతండాలో సీసీరోడ్లు, జీపీ నూతన భవనాల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.15 లక్షతో మండల కేంద్రంలో సీసీరోడ్లు, అండర్‌డ్రైయినేజీ, తిమ్మాయిపల్లిలోరూ.10 లక్షలతో సీసీరోడ్లు, సారంబండ తండాలో రూ.25లక్షలతో నూతన జీపీ భవన నిర్మాణం, అగ్రహారం తండాలో రూ.24 లక్షలతో నూతన జీపీ భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. బైపాస్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నష్టపరిహారం పెంచి ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్,మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాల్‌రాం గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జైపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ ప్రశాంత్ నాయక్, నాయకులు అంజయ్య, గణేష్‌గౌడ్, జీపీబీ వెంకటయ్య గౌడ్, శివ, ప్రశాంత్ నాయక్ ఉన్నారు.

మహిళ కడుపులో కణితి తొలగింపు

అచ్చంపేట రూరల్: వృత్తిరీత్యా వైద్యుడే అయినప్పటికీ ప్రస్తుతం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మంగళవారం అచ్చంపేట ప్రాంతీయ ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసి మహిళ కడుపులోని కణితిని వైద్యుల సాయంతో తొలగించారు. చారగొండ మండలానికి చెందిన గోరటి లక్ష్మమ్మ పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించగా, కడుపులో కణితి ఉందని తేలింది. శస్త్రచికిత్స కోసం పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు అవుతుందని, చాలా రోజులుగా అలాగే బాధ పడింది. అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రెండోసారి మెగా సర్జికల్ క్యాంపు నిర్వహిస్తుండటంతో విషయాన్ని ఎమ్మెల్యేకు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అచ్చంపేట ఆపరేషన్ థియేటర్‌లో స్థానిక వైద్యుల సాయంతో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మహిళకు శస్త్ర చికిత్స చేసి కడుపులోని కణితిని తొలగించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



దేవల్‌తిర్మలాపూర్‌లో ఘనంగా నిర్వహిస్తున్న శ్రీదేవి-భూదేవి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్ గ్రామంలోని శ్రీదేవి-భూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. స్వామివారి కల్యాణాన్ని పురోహితులు శేషాచార్యులు, శేఖర్ శర్మలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం, శ్రీనివాసులు, ప్రతాపరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండల కేంద్రంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ తెలిపారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షబంధన, అఖండ దీపారాధన, నవగ్రహ పూజ, కలశస్థాపన, రుత్వికరణ, మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. 13న



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, ప్రదోశకాల పూజలు, భజన మహామంగళహారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న సుప్రభాతసేవ, ప్రాతఃకాల పూజ, సత్యనారాయణస్వామి వ్రతం, రథోత్సవం, దూపోత్సవం, మహామంగళహారతి, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా అన్నమాచార్య ట్రస్టు తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారులు సురేష్ ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల



చారకొండ: మండలంలోని 6 ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ముసాయిదాను మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ విడుదల చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాను న్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగంగా పోలింగ్ కేంద్రాల ముసాయిదాను గ్రామ పంచాయతీలకు పంపినట్లు తెలిపారు. మండలంలోని మొత్తం 41 పోలింగ్ కేంద్రాలున్నట్లు తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో దాదాపు 515 ఓటర్లు ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కా ర్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు ముసాయిదా జాబితా..

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ ఓటరు ముసాయిదా జాబితాను ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీల స్థానాలకు సంబంధించిన ఓటరులిస్టును విడుదల చేసినట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా 11ఎంపీటీసీల స్థానాలకు ముసాయిదా ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల్లో సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. ఎలాంటి అభ్యంతరాలున్నా ఈనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల వరకు తెలపవచ్చన్నారు. అనంతరం ముసాయిదా జాబితాను విడుదల చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ తుమ్మల రేవంత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ హేమంత్‌రెడ్డి, బుచ్చిరాములు, టైపిస్ట్ పరమేష్, తదితరులు ఉన్నారు.

జాబితాపై అభ్యంతరాలు లేవు



తిమ్మాజిపేట: మండలంలోని 12 ప్రాదేశిక నియోజక వర్గాల(ఎంపీటీసీ) ఓటరు జాబితాపై ఇప్పటి వరకు ఎలాంటి అభ్యంతరాలు అందలేదని ఎంపీడీఓ లక్ష్మీదేవి తెలిపారు. తిమ్మాజిపేటలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యాదర్శులతో కలిసి ఎంపీటీసీ నియోజకవర్గాల ఓటరు జాబితాను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ప్రజలకు, ఆయా పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో 'కాంగ్రెస్' విఫలం



రాయవరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

లింగాల: ఎలాగైనా అధికారంలోకి రావాలని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గువ్వల బాలరాజు విమర్శించారు. మండలంలోని రాయవరంలో మంగళవారం బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనలో తడబడుతూ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేటీ.తిర్పతయ్య, వెంకట్‌రెడ్డి, నాగేశ్వర్, సేవ్యా నాయక్, శేషయ్య, కోనేటి తిర్పతయ్య, అశోక్‌రెడ్డి, రానోజీ, పలు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బైపాస్ బాధితులకు ఇళ్లు నిర్మించాలి



చారకొండలో రిలేదీక్ష చేస్తున్న బైపాస్ బాధితులు

చారకొండ: మండల కేంద్రంలో జడ్చర్ల –కోదాడ జాతీయ రహదారిపై ఇటీవల బైపాస్ నిర్మాణంలో 29 కుటుంబాలు ఇళ్లు కోల్పోయారని, వారికి నూతన ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నష్టపరిహారం 50 లక్షలు చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండపల్లి బాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం బాధితులు న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దతు తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలని తహసీల్దార్, ఆర్‌డీఓ కలెక్టర్‌కు వినతులు అందించినా, వారికి న్యాయం చేయకపోవడం సరి కాదన్నారు. నిర్వాసితులు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. సంబంధిత అధికారులు, నాయకులు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు గ్యార రాజు, విజయ్, అలివేలు, సందురి చిట్టెమ్మ, గుండె బాల్‌నారాయణ, నునే విష్ణు, లక్ష్మయ్య, అనసూయ, సుమతమ్మ, లక్ష్మమ్మ, బాలమ్మ, వెంకటమ్మ, రాములమ్మ, కిరణ్ ఉన్నారు.

రైతు దీక్షకు తరలిరావాలి

కల్వకుర్తి రూరల్: ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న ఆమనగల్లులో నిర్వహించే రైతుదీక్షను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూపొందించిన రైతుదీక్ష పోస్టర్‌ను మంగళవారం మండలంలోని తర్నికల్ గ్రామంలో విడుదల చేశారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రతి గ్రామంలో పోస్టర్లు అంటిస్తున్నారు. ప్రతి ఒక్కరు తరలివచ్చి రైతు దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

కొల్లాపూర్: కొల్లాపూర్ ఎంపీడీఓగా జైరాంవిజయ్ మంగళవా రం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయనను సత్కరించారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పథకాలు అమలు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.

గడ్డివాము దగ్ధం

తిమ్మాజిపేట: గుర్తు తెలియని దుండగులు గడ్డి వాముకు నిప్పు పెట్టడంతో రూ.2లక్షల విలువైన పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని మల్లయ్యగౌడ్‌కు చెందిన గడ్డి వాముకు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. గడ్డి కాలిపోతున్న విషయం గమనించిన కొందరు ఆర్పేందుకు ప్రయత్నించారు. వెంటనే ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది మంటలు ఆర్పేందుకు శ్రమించినా ఫలితం దక్కలేదు.

చెంచులకు వ్యవసాయ పరికరాల పంపిణీ



లింగాల: మండలంలోని శాయిన్‌పేటకు చెందిన చెంచులకు మంగళవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. చెంచుల జీవనోపాధి మెరుగుదలకు పరికరాలను అందజేసినట్లు సంస్థప్రాజెక్ట్ మేనేజర్ ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శివయ్య, నర్సింహ, కుర్మయ్య, పద్మ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

తాడూరు: మండలంలోని మేడిపూర్ పాఠశాలకు క్లాస్‌మేట్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.20 వేల విలువైన స్కానర్, ప్రింటర్‌ను పాఠశాల హెచ్‌ఎం జ్యోతికి అందజేశారు. ఈ సందర్భంగా వారి సేవలు అభినందనీయమని కొనియాడారు. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనిల్ కుమార్ రెడ్డి, త్యాగరాజుగౌడ్, డాక్టర్ వెంకటేష్, శ్రీనివాసులు, ప్రసాద్, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

జనకల్యాణ్‌దివస్ ఫండ్ మాయవతికి అందజేత

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా బీఎస్పీ నేతలు ఇటీవల ప్రజల నుంచి సేకరించిన జనకల్యాణ్‌దివస్ 2025 ఫండ్‌ను బీఎస్పీ అధినేత్రి కుమారి మాయవతికి ఢిల్లీలోని ఆమె నివాసంలో అందజేసినట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ్‌దివస్ ఫండ్ సేకరణలో భాగంగా ప్రజల నుంచి రూ.1.50 లక్షలు, పార్టీ కార్యకర్తల నుంచి రూ.50 వేలు, మొత్తం రూ.2 లక్షలు అందజేసినట్లు తెలిపారు. వర్కాల ధనుంజయ్ రూ.50 వేలు సేకరించి మాయవతి అందజేసినట్లు తెలిపారు.

గేమ్యానాయక్ తండాను పంచాయతీ చేయాలి

కొల్లాపూర్: మండలంలోని గేమ్యానాయక్ తండాను గ్రామ పంచాయతీ చేయాలని మంగళవారం ఆర్‌డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ పంచాయతీగా గుర్తింపు పొందేందుకు అవసరమైన జనాభా గేమ్యానాయక్ తండాకు ఉందన్నారు. ఈ మేరకు ఆర్‌డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు,. కార్యక్రమంలో తిరుపతినాయక్, తారాసింగ్, బాలు, తదితరులు ఉన్నారు.

'రైతునేస్తం' వినియోగించుకోండి



రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ, రైతులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమాన్ని మండల రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ కోరారు. మంగళవారం నిర్వహించిన 'రైతునేస్తం' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వ్యవసాయంలో పాటించాల్సిన ఆధునిక పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, పంటల సస్యరక్షణ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. రైతులు మండల కేంద్రానికి వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



కేస్లీతండాలో గ్రామసభను నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఉపాధిలో ఖర్చు చేసిన నిధులపై గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కేస్లీతండాకు రూ.8.85లక్షలు, ఎంజీతండాకు రూ.7.54లక్షలు ఖర్చు చేసినట్లు తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనులను గ్రామసభలో వివరించారు. కొంతమంది కూలీలకు డబ్బులు చెల్లించలేదని తనిఖీ బృందానికి ఫిర్యాదు చేశారు. కూలీల బ్యాంక్ ఖాతాలు సక్రమంగా లేకపోవడం, పోస్టాఫీస్‌లో ఖాతాలు పనిచేయకపోవడంతో కూలీలకు సకాలంలో డబ్బులు అందడం లేదని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, టీఏలు విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, డీఆర్‌పీలు శ్రీకాంత్, శిరీష, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలోని ఉపాధి హామీ పనులను ఏపీఓ నాగరాజు తనిఖీ చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని ఆయన తెలిపారు. అనంతరం మస్టర్లలో నమోదైన కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి రవితేజ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థినులకు నగదు బహుమతి అందజేస్తున్న రాజ మహేందర్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు ప్యాడ్స్, బహుమతులు అందిస్తున్న రాజేందర్

కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం థామస్ అల్వా ఎడిసన్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడంతో పాటు, పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, పురం చంద్, రమేష్, బలరాం, క్లబ్ బాధ్యులు రాజ్యలత, సమీనా, రాజేందర్, మల్లేష్, మంజుల, పద్మ, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు అందజేత

తెలకపల్లి: స్పెల్‌బీ మండలస్థాయి పోటీలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. గౌరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని శ్వేత, 5వ తరగతి విద్యార్థిని అనన్య స్పెల్‌బీ ఆంగ్ల పదజాల పోటీలలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థినులకు సీఎల్ఆర్ వి ద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమంహేందర్ రెడ్డి నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాజమంహేందర్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని సబ్జెక్ట్‌లతో పాటు ఆంగ్లంలో పట్టు సాధించాలని, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవి, సునిల్ కుమార్, కవిత, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభ వాల్‌పోస్టర్ విడుదల

తెకలపల్లి: మార్చి 8,9 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే పద్మశాలి శంఖారావం మహాసభ వాల్‌పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో సంఘం నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో మాకం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మోహన్, గణేష్, భాస్కర్, మల్లేష్, మధుసూదన్ ఉన్నారు.

బడిబయట పిల్లలపై సర్వే

తాడూరు: మండల కేంద్రం, గ్రామాల్లో సీఆర్‌పీ నరేందర్ ఆధ్వర్యంలో బడి బయటి పిల్లల వివరాలపై సర్వే నిర్వహించారు. ప్రతి పాఠశాలలో బడి బయట పిల్లల వివరాలను తెలుసుకుని, ఆ జాబితా ఆధారంగా ఇంటింట తిరిగి పాఠశాలకు రాకపోవడానికి గల కారణాలను తల్లిదండ్రులతో మాట్లాడి, తిరిగి పాఠశాలకు పంపే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఆ పాఠశాలల హెచ్‌ఎం సహకారంతో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈదమ్మ జాతర ప్రారంభం

కొల్లాపూర్: పట్టణంలో ఈదమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభమైంది. రైతు సంఘం నాయకులు సర్కార్ బోనాన్ని ఈదమ్మ దేవతకు సమర్పించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య దంపతులు, విజయలక్ష్మీచంద్రశేఖరాచార్యులు ఈదమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇందిర కాలనీకి చెందిన శివకుమార్ అమ్మవారికి తోరణం, త్రిశూలం అలంకరించారు. మాజీ కౌన్సిలర్ కోడేండ్ల సత్యంయాదవ్ ఆలయంలో గంట ఏర్పాటు చేశారు. రైతు సంఘం నాయకులు పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు.

